నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది

పఠనలేఖనములు పాటించకుండిరి
బాలకులును నేడు బడులయందు
పలుకులోన గూడ పరిపూర్ణతయు లేక
తెలుగు భాషకున్న తెగులు బుట్టె

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 45 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 24-06-2026 | పేజీలు-8 | వెలః రూ. 5.00




## పవన్ పై విమర్శలకు గట్టిగా కౌంటర్ ఇవ్వండి!

- పవన్ పై విమర్శలు వస్తే చూస్తూ ఊరుకోకండి
- మంత్రులకు సీఎం చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు
- కేబినెట్ సమావేశంలో మంత్రులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులకు కీలక సూచనలు సమాచారం. అజెండా అంశాలపై చర్చ ముగిసిన అనంతరం మంత్రులతో జరిగిన సమావేశంలో ప్రభుత్వం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై ప్రతిపక్ష వైఎస్ఆర్ సీపీ చేస్తున్న విమర్శల అంశం ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. ఇటీవళ రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న వివిధ అంశాలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చురుకుగా స్పందిస్తున్న నేపథ్యంలో ఆయనను లక్ష్యంగా చేసుకుని ప్రతిపక్ష నేతలు విమర్శలు చేస్తున్నారని సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్ పై వ్యక్తిగత లేదా రాజకీయ విమర్శలు వచ్చినప్పుడు మంత్రులు, అధికార కూటమి

-మిగతా 2 లో

# మెట్రో ఫేజ్-2కు గ్రీన్ సిగ్నల్

ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు ఫలప్రదం

- కేంద్ర మంత్రి ఖట్టర్ నివాసంలో కీలక భేటీ
- మెట్రో ఫేజ్-1ను పూర్తిగా స్వాధీనం చేసుకోనున్న ప్రభుత్వం
- ఆర్థిక, సాంకేతిక అధ్యయనం కోసం ప్రతిష్టాత్మక కన్సల్టెంట్ ఎంపిక
- కేంద్ర, రాష్ట్ర అధికారులతో ప్రత్యేక సమన్వయ కమిటీ ఏర్పాటు
- మెట్రో విస్తరణపై కేంద్ర మంత్రులతో సీఎం 40 నిమిషాల సుదీర్ఘ చర్చలు

న్యూఢిల్లీ, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు భవిష్యత్తుకు సంబంధించి అత్యంత కీలకమైన అడుగు పడింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రులతో జరిపిన వరుస సమావేశాలు విజయవంతమయ్యాయి. మెట్రో ఫేజ్-1ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, అలాగే ఫేజ్-2 విస్తరణ పనుల్లో ఉన్న అన్ని ప్రధాన ఆటంకాలు ఈ చర్చలతో తొలగిపోయాయి. మంగళవారం ఉదయం కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు ఉన్నతస్థాయి సంయుక్త సమావేశం జరిగింది. ఈ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు

-మిగతా 2 లో





## 109 కోట్లు దాటిన ఇంటర్నెట్ యూజర్లు.

- ట్రాయ్ తాజా నివేదికలో వెల్లడి
- మూడు నెలల్లోనే 6.24 శాతం పెరిగిన నెట్ సబ్‌స్క్రైబర్లు
- దేశవ్యాప్తంగా 133 కోట్లకు చేరిన మొత్తం ఫోన్ కనెక్షన్లు
- రూ.196.04కు పెరిగిన కంపెనీల సగటు నెలవారీ ఆదాయం
- లైసెన్స్ ఫీజు రూపంలో ప్రభుత్వానికి రూ.6,936 కోట్ల ఆదాయం

న్యూఢిల్లీ,
భారత టెలికామ్ రంగం అప్రతిహత వృద్ధిని కొనసాగిస్తోంది. దేశంలో ఇంటర్నెట్ , టెలిఫోన్ వినియోగదారుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) తన తాజా నివేదికలో వెల్లడించింది. ఆ నివేదిక ప్రకారం.. 2026 మార్చి నాటికి దేశంలో మొత్తం ఇంటర్నెట్ సబ్‌స్క్రైబర్ల

-మిగతా 2 లో




## ఘనంగా పద్మపురస్కారాల ప్రదానం

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా 65 మందికి పురస్కారాలు
- మలయాళ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ బహూకరణ
- తెలుగు నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌లకు పద్మశ్రీ
- హాజరైన ఉపరాష్ట్రపతి, ప్రధాని మోదీ మరియు కేంద్ర మంత్రులు

న్యూఢిల్లీ,
రాష్ట్రపతి భవన్‌లో రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 65 మంది ప్రముఖులకు పద్మ అవార్డులు అందజేశారు. ఈ విడతలో మొత్తం 2 పద్మ విభూషణ్, 7 పద్మభూషణ్, 56 పద్మశ్రీ పురస్కారాలు ప్రదానం చేశారు. సినీ, సాహిత్య, వైద్య, క్రీడా తదితర రంగాల్లో విశేష కృషి చేసిన పలువురు ప్రముఖులు ఈ గౌరవాలను

-మిగతా 2 లో

## పాక్, ఖతార్‌లను నమ్మలేం



- ఉగ్రవాదానికి ఊతమిచ్చిన ఘనత వారిది
- బిన్‌లాడెన్‌ను దాచిపెట్టిన చరిత్ర పాక్‌ది
- జెడి వాన్స్ వ్యాఖ్యలపై ఇద్దరు సెనేటర్ల విమర్శలు

2

## అమెరికా పౌరసత్వం మరింత ఖరీదు

- ఫైలింగ్ ఫీజులను 75శాతం పెంచే యోచన



2



## హిందీ మనకు అవసరం లేదు

- తమిళం, ఇంగ్లీస్ సరిపోతుంది
- నీట్‌తో విద్యార్థుల్లో గందరగోళం
- కుటుంబ పార్టీలకు తాము వ్యతిరేకం
- ప్రజలంతా తమ కుటుంబమనే భావనతో పాలన
- ఎన్నో అవమానాలు ఎదుర్కొని ఇక్కడికి వచ్చా
- ప్రజల సంపూర్ణ మద్దతుతో అధికారం చేపట్టాం
- కరూర్ తొక్కిసలాట ఘటన మరచిపోలేని విషాదం
- అసెంబ్లీలో సిఎం విజయ్ కీలక ప్రసంగం

చెన్నై,
తమిళనాడు విద్యార్థుల్లో నీట్ అసమానతల్ని సృష్టిస్తోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ అన్నారు. అసమానతలకు కారణమైన నీట్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమిళనాడు అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ మంగళవారం కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా హిందీ వివాదం, నీట్, కరూర్ తొక్కిసలాట ఘటన వంటి పలు అంశాలను ప్రస్తావించిన విజయ్ విమర్శకులకు గట్టిగా బదులిచ్చారు. ఈ మేరకు అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందీ భాషనూ వ్యతిరేకించారు. తమిళం, ఇంగ్లీష్‌లతో కూడిన ద్విభాషా విధానానికే తాము కట్టుబడి ఉంటామన్నారు. నీట్ వల్ల సామాజిక అసమానతలు పెరుగు తున్నాయని సీఎం విజయ్ చెప్పకొచ్చారు. విద్యార్థులపై తీవ్ర మానసిక ఒత్తిడి తెస్తున్న ఈ పరీక్షను రద్దుచేసి, ఇంటర్ మార్కుల ఆధారంగా వైద్య సీట్లను కేటాయించాలని తమిళనాడు చాలా కాలంగా కోరుతోందని ఆయన గుర్తుచేశారు. హిందీ భాషపైనా స్పందిస్తూ.. తమిళం రాష్ట్ర భాషగా, ఇంగ్లీష్ అంతర్జాతీయ భాషగా సరిపోతాయని తన వైఖరిని స్పష్టం చేశారు. మూడో భాషను బలవంతంగా రుద్దాల్సిన అవసరంలేదని, రెండు భాషల విధానమే కొనసాగుతుందని తేల్చి చెప్పారు. తమ పార్టీని విమర్శించే వారికి ఈ సందర్భంగా గట్టిగా సమాధాన

-మిగతా 2 లో



## కాంగ్రెస్ హామీలపై హరీష్ రావు ఫైర్

- రైతుబంధు, రుణమాఫీపై విమర్శలు
- 'రైతు క్షమాపణ సభ'గా మార్చాలంటూ ఎద్దేవా
- కేసీఆర్ పాలనను గుర్తుచేసిన హరీష్
- 'రైతు ఆశీర్వాద సభ' కాదు.. 'రైతు క్షమాపణ సభ' పెట్టుకోండి.!

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలకు, రైతులకు నమ్మకద్రోహం చేశారని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. హామీలు 100 రోజుల్లో నెరవేర్చకపోతే నిలదీయమన్న భట్టి విక్రమార్క మాటలను గుర్తు చేస్తూ.. మరి ఇప్పుడు రండి, మిమ్మల్ని నిలదీస్తాం అని హరీష్ రావు సవాల్ విసిరారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలపై హరీష్ రావు తీవ్రస్థాయిలో

-మిగతా 2 లో

# కాపు నేతలను ఉచ్చులోకి లాగుతున్న జగన్

కులాల, మతాల మధ్య జగన్ చిచ్చుపెడుతున్నారు

- అంబటి, పేర్ని నాని, గుడివాడ అమర్ నాథ్ లాంటి వారితో తప్పులు చేయించారు
- పాస్టర్లను అడ్డుపెట్టుకుని మతాల మధ్య చిచ్చు పెట్టాలని చూశారు
- నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



అమరావతి జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఎన్నికల ఓటమి నిరాశతో వైసీపీ అధినేత జగన్... రాష్ట్రంలో ప్రాంతాలు, మతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టేందుకు కుట్ర చేస్తున్నారని ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైసీపీలో ఉన్న కాపు నేతలను రెచ్చగొట్టి, వారితో తప్పులు చేయించి, జైలుకు పంపేలా జగన్ అండ్ కో స్కెచ్ వేస్తోందని ఆరోపించారు. "శ్రీలక్ష్మి, అంబటి రాంబాబు, పేర్ని నాని, గుడివాడ అమర్ నాథ్ లాంటి వారితో జగన్ తప్పులు చేయించారు. కొందరిని జైలుకు పంపడం ద్వారా వారు తన ఉచ్చు లోంచి అంత త్వరగా బయటకు రాలేక, జీవితాంతం పులివెందుల అజెండా చుట్టూ తిరిగేలా చేస్తున్నారు. నేరస్తులను తయారు చేసే కర్మాగారం గొడ్డలి పార్టీ అయితే.. బలమైన లీడర్లను తయారు చేసే కర్మాగారం టీడీపీ" అని అన్నారు. సాక్షాత్తు కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని అపవిత్రం

-మిగతా 2 లో

## రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని మోదీ భేటీ



- క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణపై చర్చ?

న్యూఢిల్లీ
కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై జోరుగా చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును రాష్ట్రపతి భవన్‌లో కలుసుకున్నారు. ఈ భేటీకి సంబంధించిన చిత్రాలను రాష్ట్రపతి కార్యాలయం ఎక్స్ వేదికగా పంచుకుంది.

-మిగతా 2 లో



## స్వయం సమృద్ధి గ్రామాలే లక్ష్యం

- శాఖల సమన్వయంతో ఆదర్శ గ్రామాల నిర్మాణం
- గ్రామ ప్రణాళికలను రెండు నెలల్లో సిద్ధం చేసి అమలు చేయాలి
- నిధుల దుర్వినియోగంపై కఠిన చర్యలు
- స్థానిక వనరులతోనే తాగునీటి సమస్య పరిష్కారం
- అధికారులకు మంత్రి సీతక్క దిశానిర్దేశం

2

## 109 కోట్లు దాటిన ఇంటర్నెట్ యూజర్లు.

మొదటి తరువాయి

సంఖ్య 109.27 కోట్లకు చేరింది. 2025 డిసెంబర్ చివరి నాటికి ఈ సంఖ్య 102.86 కోట్లుగా ఉండగా.. కేవలం మూడు నెలల్లోనే 6.24 శాతం వృద్ధి నమోదైంది.ట్రాయ్ నివేదిక ప్రకారం.. మొత్తం ఇంటర్నెట్ వినియోగదారులలో 104.62 కోట్ల మంది వైర్‌లెస్ ద్వారా, 4.65 కోట్ల మంది వైర్డ్ కనెక్షన్ల ద్వారా ఇంటర్నెట్ సేవలు పొందుతున్నారు. వీరిలో బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారుల సంఖ్య 106.58 కోట్లుగా ఉండగా.. న్యారోబ్యాండ్ (56 కేబీపీఎస్ కంటే తక్కువ వేగం) సబ్‌స్క్రైబర్లు 2.69 కోట్లుగా ఉన్నారు. త్రైమాసిక ప్రాతిపదికన బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్ల బేస్ 5.81 శాతం పెరగడం విశేషం. ఇంటర్నెట్‌తోపాటు మొత్తం టెలిఫోన్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య కూడా 133.05 కోట్లకు పెరిగింది. దాంతో దేశవ్యాప్తంగా టెలి-డెన్సిటీ (ప్రతి 100 మందికి ఉన్న ఫోన్ కనెక్షన్లు) గత త్రైమాసికంలోని 91.74 శాతం నుంచి 93.26 శాతానికి మెరుగుపడింది. వైర్‌లైన్ టెలిడెన్సిటీ సైతం 3.33 శాతం నుంచి 3.38 శాతానికి పెరిగింది. వినియోగదారుల నుంచి వచ్చే సగటు నెలవారీ ఆదాయం కూడా టెలికామ్ సంస్థలకు సానుకూలంగా ఉంది. వైర్‌లెస్ సేవలకు సంబంధించి ఏఆర్‌పీయూ 0.76 శాతం పెరిగి రూ.196.04కి చేరింది. వార్షిక ప్రాతిపదికన చూస్తే ఇది 7.15 శాతం పెరుగుదల. అదేవిధంగా వినియోగ సమయం కూడా స్వల్పంగా పెరిగి నెలకు సగటున 1,017 నిమిషాలకు చేరింది. టెలికామ్ రంగం వృద్ధి ప్రభుత్వ ఆదాయానికి కూడా ఊతమిచ్చింది. 2026 మార్చితో ముగిసిన త్రైమాసికంలో టెలికామ్ కంపెనీల నుంచి లైసెన్స్ ఫీజు రూపంలో ప్రభుత్వానికి రూ.6,936 కోట్ల ఆదాయం లభించింది. అంతకుముందు త్రైమాసికంలో ఇది రూ.6,733 కోట్లుగా ఉంది. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అనుమతి పొందిన 917 ప్రైవేట్ శాటిలైట్ టీవీ ఛానెళ్లు దేశంలో కార్యకలాపాలు సాగిస్తున్నాయని కూడా ట్రాయ్ తన నివేదికలో పేర్కొన్నది.

## ఘనంగా పద్మపురస్కారాల ప్రదానం

మొదటి తరువాయి

అందుకున్నారు. మలయాళ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ పురస్కారం లభించింది. అలాగే ప్రముఖ వైద్య నిపుణులు నోరి దత్తాత్రేయుడుకు కూడా పద్మభూషణ్ అవార్డు ప్రదానం చేశారు. తెలుగు సినీ రంగానికి చెందిన ప్రముఖ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌తో పాటు నటుడు ఆర్. మాధవన్‌కు పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. క్రికెటర్ రోహిత్ శర్మకు కూడా పద్మశ్రీ అవార్డును రాష్ట్రపతి అందజేశారు. ప్రఖ్యాత మలయాళ పాత్రికేయుడు పి.నారాయణన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేటీ థామస్ పద్మవిభూషణ్ అందుకోగా.. సినీ రంగ ప్రముఖులు మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌తో పాటు ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ పురస్కారాలను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి నేడు పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నవారిలో సినీ నటులు మాగంటి మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్ ఉన్నారు. అలాగే, వీరితో పాటు సినీనటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్ శర్మ, పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకున్నారు. దేశంలోని పలు రంగాల్లో విశేష సేవలందించిన వారికి భారత గణతంత్ర దినోత్సవం వేళ కేంద్రం మొత్తం 131 మందికి పద్మ పురస్కారాలకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. తొలి విడతలో 66 మందికి అందజేయగా.. మిగతా వారికి మంగళవారం ప్రదానం చేశారు. దేశ అభివృద్ధికి, తమ తమ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులను గౌరవించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది పద్మ పురస్కారాలను ప్రదానం చేస్తోంది. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా పౌరసత్వం మరింత ఖరీదు

### ఫైలింగ్ ఫీజులను 75శాతం పెంచే యోచన



**వాషింగ్టన్,**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇమిగ్రేషన్ రూల్స్‌ను కఠినతరం చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన కార్యవర్గం చేసిన ప్రతిపాదనలతో అమెరికా పౌరసత్వం మరింత ఖరీదుగా మారనుంది. పౌరసత్వ దరఖాస్తుల ఫైలింగ్ ఫీజులను 75 శాతం మేర పెంచాలని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ ప్రతిపాదించింది. సక్రమ మార్గంలో వచ్చిన వలసదారులు పౌరసత్వానికి దరఖాస్తు చేసుకుంటే.. ప్రాసెసింగ్, వెట్టింగ్ ఖర్చులు భరించాల్సిరావడంతో పాటు ఇప్పటివరకు ఉన్న పలు మినహాయింపులను కూడా కోల్పోనున్నారు.

## హిందీ మనకు అవసరం లేదు

మొదటి తరువాయి

మిచ్చారు సీఎం విజయ్. ప్రజల మద్దతుతోనే తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధికారంలోకి వచ్చిందన్న ఆయన.. దీని వెనుక ఎన్నో కుట్రలు, సవాళ్లను ఎదుర్కొ న్నామన్నారు. 'జనం గుండెల్లో స్థానం సంపాదించడం అంత సులువు కాదు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే ఇక్కడకు వచ్చాం. అయినప్పటికీ కొందరు 'నటుడి పార్టీ' అనే విమర్శలు గుప్పిస్తున్నారు. వాటన్నింటినీ మేం పట్టించుకోం. మా రాజకీయాలు పారదర్శకంగా ఉంటాయని విజయ్ చెప్పుకొచ్చారు. అలాగే కుటుంబ రాజకీయాలపై ఆయన మాట్లాడుతూ.. 'మా రాజకీయాలు ఒక్క కుటుంబం కోసమే కాదు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం మాదే. అదే మా పాలన.. అదే మా లక్ష్యం' అని స్పష్టం చేశారు. ఎన్నో సవాళ్లను దాటి తాము అధికారంలోకి వచ్చామని, నటుడి పార్టీ అని తమను ఎంతోమంది ఎగతాళి చేశారని గుర్తుచేసుకున్నారు. మాకు ఈ అధికారం అంత సులువుగా వచ్చింది కాదు. తమిళనాడు ప్రజల హృదయాలను గెలుచుకునేందుకు నేను, నా పార్టీ ఎన్నో కుట్రలు, సవాళ్లను అధిగమించాల్సి వచ్చింది. మాది యాక్టర్ పార్టీ అని, నేను సినిమా షూటింగ్ నుంచి నేరుగా సీఎం కుర్చీలో కూర్చున్నానని చాలా మంది గేలి చేశారు. అలాంటి విమర్శలు నేను పట్టించుకోను. సాధారణంగా చాలా మంది రాజకీయ పార్టీ పెట్టి ప్రజల్లోకి వెళ్తారు. కానీ, నేను ప్రజల్లోకి వెళ్లిన తర్వాత పార్టీ పెట్టి ఎన్నికల్లో పోటీ చేశా. నాపై నమ్మకం ఉంచి ప్రజలు గెలిపించారని విజయ్ అన్నారు. తమిళనాడులో ద్విభాషా విధానానికే తాము కట్టుబడి ఉన్నట్లు సీఎం పునరుద్ఘాటించారు. హిందీ భాషను రుద్దేందుకు కేంద్రం చేస్తోన్న ప్రయత్నాలను తాము ఎప్పటికీ అంగీకరించబోమన్నారు. ప్రసంగంలో భాగంగా ఎన్నికల ప్రచార సమయంలో చోటుచేసుకున్న కరూర్ తొక్కిసలాట ఘటనను విజయ్ ప్రస్తావించారు. 41 మంది ప్రాణాలు కోల్పోయిన ఆ విషాద ఘటన నన్ను ఎంత వేదనకు గురిచేసిందో మాటల్లో చెప్పలేను. ఆ బాధ నన్ను ఎన్నటికీ వదలదు. ఆ ఘటన విషయం లోనూ మాపైనే నిందలేశారు. ఇది అత్యంత దారుణం. రాజకీయాలు ఇంత క్రూరంగా ఉంటాయా అని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారసత్వ రాజకీయాల గురించి స్పందిస్తూ డీఎంకేపై విజయ్ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. డీఎంకేను ఉద్దేశిస్తూ కేవలం ఒక కుటుంబానికే ప్రాధాన్యమివ్వడం మా రాజకీయ విధానం కాదు. తమిళనాడులోని ప్రతి కుటుంబానికి మా సేవలందిస్తాం. అదే మా రాజకీయం. అదే మా పాలనా విధానమని విజయ్ పేర్కొన్నారు.

## పవన్ పై విమర్శలకు గట్టిగా కౌంటర్ ఇవ్వండి!

మొదటి తరువాయి

నాయకులు వెంటనే స్పందించి వాస్తవాలను ప్రజలకు వివరించాలని ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిసింది. అదేవిధంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి చర్యలపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు కూడా సమయానుకూలంగా సమాధానాలు ఇవ్వాలని మంత్రులకు సీఎం సూచించినట్లు సమాచారం. ప్రభుత్వ విధానాలు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రజల్లో స్పష్టత తీసుకురావడంలో మంత్రులు మరింత చురుకుగా వ్యవహరించాలని కోరినట్లు తెలుస్తోంది. ఇటీవళ విజయవాడలో చోటుచేసుకున్న సాయికృష్ణ, క్రాంతికుమార్ మరణాల ఘటనలు, డీఎస్సీ అంశం తదితర విషయాలపై ప్రతిపక్ష విమర్శలకు అధికార కూటమి నుంచి తగిన స్థాయిలో స్పందన రాలేదనే అభిప్రాయాల నేపథ్యంలో ముఖ్యమంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రభుత్వంపై వచ్చే విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టడంతో పాటు కూటమి ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.



# మెట్రో ఫేజ్-2కు గ్రీన్ సిగ్నల్

మొదటి తరువాయి

కేంద్రమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్, జి. కిషన్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. మెట్రో విస్తరణ, నిధుల సమీకరణ, కేంద్ర-రాష్ట్ర ఉమ్మడి భాగస్వామ్యంపై ఈ సమావేశంలో అందరూ ఒక ఏకాభిప్రాయానికి వచ్చారు. మెట్రో ప్రాజెక్టును ఆర్థికంగా, సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిష్ఠాత్మక ఆర్థిక సలహా సంస్థను కన్‌స్టలెంట్‌గా ఎంపిక చేశారు. ఈ సంస్థ ప్రధాన అంశాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇవ్వనుంది. ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రో ఫేజ్-1ను ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకుంటున్న నేపథ్యంలో.. దానికి సంబంధించిన అప్పులు, ఈక్విటీ విలువ రుణ సేకరణపై రోడ్ మ్యాప్ తయారు చేస్తుంది. ఫేజ్-2 కింద ప్రతిపాదించిన కారిడార్ల నిర్మాణ వ్యయం ఎంత అవుతుంది? నిధుల కోసం ఏయే అంతర్జాతీయ రుణ సంస్థలను ఎంచుకోవాలి? అనే అంశాలపై నివేదిక అందిస్తుంది. ఈ కన్‌స్టలెంట్ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా తదుపరి అడుగులు వేస్తాయి. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో ఒక ప్రత్యేక సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో కేంద్రప్రభుత్వ ప్రతినిధితో పాటు తెలంగాణ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి సమన్వయ సభ్యులుగా వ్యవహరిస్తారు. కేంద్ర నిబంధనల ప్రకారం డీపీఆర్ లలో మార్పులు చేస్తూ, పనుల అనుమతుల పక్రియను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఈ పరిణామంతో హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణకు కేంద్ర ఆమోదం లభించడం సులభతరం కానుంది. ఇది హైదరాబాద్ నగర ట్రాఫిక్ కష్టాలను తీర్చడమే కాక, భవిష్యత్తు ప్రజా రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిలవనుంది. కేంద్రమంత్రి ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో.. హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. మెట్రో ప్రాజెక్టుకు అప్పులు, రెండో ఫేజ్‌కు అనుమతులు, నిధులు కావాలని సీఎం రేవంత్ కోరినట్లు సమాచారం. సమావేశంలో సీఎస్ రామకృష్ణ రావు, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు. రెండు రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోనే ఉన్నారు. కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలతో బిజీబిజీగా గడుపు తున్నారు. ఇప్పటికే ఢిల్లీలో ఉన్న మంత్రి శ్రీధర్ బాబు.. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కలిశారు.

## పాక్, ఖతార్‌లను నమ్మలేం

**-ఉగ్రవాదానికి ఊతమిచ్చిన ఘనత వారిది**
**-బిన్‌లాడెన్‌ను దాచిపెట్టిన చరిత్ర పాక్‌ది**
**-జెడి వాన్స్ వ్యాఖ్యలపై ఇద్దరు సెనేటర్ల విమర్శలు**



వాషింగ్టన్,
పాకిస్థాన్‌పై ప్రేమను వ్యక్తం చేస్తూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై అమెరికాకు చెందిన ఇద్దరు సెనేటర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ దేశ ఉగ్రచరిత్ర గురించి ప్రస్తావిస్తూ, బిన్ లాడెన్‌ను దాచిన ఘనత పాక్‌దని అన్నారు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్, ఖతార్ దేశాలపై అమెరికాకు చెందిన ఇద్దరు రిపబ్లికన్ సెనేటర్లు రిక్ స్కాట్, టిమ్ షీహీ ఘాటుగా స్పందించారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన చరిత్ర ఆ దేశాలకు ఉందంటూ తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. కాగా, అమెరికా- ఇరాన్ శాంతి ఒప్పందానికి సంబంధించిన సాంకేతిక వివరాలపై స్విట్జర్లాండ్‌లో ఇటీవల చర్చలు జరిగాయి. ఈ సమావేశానికి పాకిస్థాన్, ఖతార్ నాయకులతో వాన్స్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 'మేము పాకిస్తాన్‌ను ప్రేమిస్తున్నాం' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. అయితే, ఈ చర్చల్లో పాకిస్థాన్, ఖతార్‌లను నిష్పక్షపాత మధ్యవర్తులుగా చూడకూడదని సెనేటర్ రిక్ స్కాట్ తేల్చి చెప్పారు. మధ్యప్రాచ్యంలో యూఏఈ, ఇజ్రాయెల్, సౌదీ అరేబియాలే వాషింగ్టన్‌కు నిజమైన మిత్రదేశాలని పేర్కొన్నారు. ఆ దేశాలనూ అమెరికా చర్చల్లో చేర్చుకోవాలని స్కాట్ సూచించారు. 'మన నిజమైన స్నేహితులు ఎవరో ఇప్పటికే అందరికీ స్పష్టంగా తెలిసి ఉండాలి. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన సుదీర్ఘ చరిత్ర ఖతార్, పాకిస్థాన్‌లకు ఉంది. ప్రస్తుతం వారు అర్థవంతమైన శాంతిని సాధించడం కంటే ఇరాన్ దశాబ్దాల నాటి ఉగ్రవాద ప్రచారాన్ని ప్రోత్సహించడానికే మొగ్గు చూపుతున్నట్లు కనిపిస్తోంది. అందరికీ ప్రయోజనం చేకూర్చే ఆచరణీయమైన ఒప్పందానికి ఇంకా ఆస్కారం ఉంది' అని ఆయన చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా మోంటానా సెనేటర్ టిమ్ షీహీ కూడా పాకిస్థాన్‌ను విమర్శించారు. 'పాకిస్థాన్ ఒక దశాబ్దం పాటు బిన్ లాడెన్‌కు ఆశ్రయం ఇచ్చిందనే విషయాన్ని మనం మరిచిపోకూడదు. పాకిస్థానీలు ఐఎస్ఐ ద్వారా మాపై పోరాడే వారికి నిధులు సమకూర్చారు. ముఖ్యంగా అయతుల్లాకు నిధులు అందించారు. ఖతార్ కూడా దశాబ్దాలుగా ఉగ్రవాద సంస్థలకు మనీలాండరింగ్ ద్వారా డబ్బును అందిస్తోంది. ఇరాన్, అమెరికా- ఇజ్రాయెల్ శాంతి ఒప్పందంలో పాకిస్థాన్, ఖతార్‌లు పాల్గొంటే.. ఆ చర్చల్లో యూఏఈ, ఇజ్రాయెల్, సౌదీ అరేబియాలనూ చేర్చుకోవాలి. మధ్యప్రాచ్యంలో ఆ మూడు దేశాలే అమెరికాకు నిజమైన మిత్రదేశాలు' అని పేర్కొన్నారు. కాగా, వీరి వ్యాఖ్యలు ఇప్పటికే ఉన్న వివాదానికి మరింత ఆజ్యం పోసినట్లు అయ్యింది.

## కాపు నేతలను ఉచ్చులోకి లాగుతున్న జగన్

మొదటి తరువాయి

చేయాలనుకున్నందుకే గత ఎన్నికల్లో ఆ దేవుడు వైసీపీకి ఘోర పరాజయాన్ని ఇచ్చి శిక్షించాడని నిమ్మల వ్యాఖ్యానించారు. పాస్టర్ ప్రవీణ్, కడప పాస్టర్ అభినయలను అడ్డుపెట్టుకుని మతాల మధ్య చిచ్చు పెట్టాలని జగన్ చూసినా ప్రజలు నమ్మలేదన్నారు. గతంలో చదలవాడ, ఆడికేశవులు నాయుడు లాంటి వారికి టీడీపీ చైర్మన్ పదవులు ఇచ్చి టీడీపీ గౌరవిస్తే.. జగన్ మాత్రం తన సొంత బంధువులైన భూమన కరుణాకర్ రెడ్డి, వైవి సుబ్బారెడ్డిలకే అవకాశాలు ఇచ్చుకున్నారని దుయ్యబట్టారు. బ్రిటిష్ కాలంలో ఉన్న కాపుల రిజర్వేషన్ ను నీలం సంజీవరెడ్డి తొలగించారని... దామోదరం సంజీవయ్య ఇచ్చిన కాపు రిజర్వేషన్లను కాసు బ్రహ్మానందరెడ్డి తొలగించారని చెప్పారు. ఆ తర్వాత కాపుల చరిత్రలో మళ్లీ రిజర్వేషన్లు ఇచ్చింది చంద్రబాబు నాయుడు మాత్రమేనన్నారు. గత చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన 5 శాతం జెఓ కాపు రిజర్వేషన్లను జగన్ అధికారంలోకి రాగానే రద్దు చేసి 'కాపు ద్రోహి'గా మిగిలిపోయారని మండిపడ్డారు. రామలక్ష్మణుల లాంటి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కాంబోను విడదీయడం ఎవరితరం కాదన్నారు.





## రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని మోదీ భేటీ

మొదటి తరువాయి

మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగవచ్చన్న ఊహాగానాలు దేశ రాజధానిలో ఊపందుకున్న వేళ ఈ భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది.కాగా, మంగళవారం ఉదయం కేరళకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు జార్జి కురియన్ కేంద్ర మంత్రివర్గానికి రాజీనామా చేశారు. ఆయన రాజ్యసభ పదవీకాలం ముగిసిపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. 65 ఏండ్ల కురియన్ కేంద్ర మైనారిటీ వ్యవహారాలు, మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ శాఖల సహాయ మంత్రిగా ఉన్నారు. ఆయన రాజీనామాను రాష్ట్రపతి ముర్ము ఆమోదించారు. జూన్ 21న రాజ్యసభ సభ్యత్వ పదవీకాలం పూర్తయిన కురియన్‌ను తిరిగి రాజ్యసభకు నామినేట్ చేయకూడదని బీజేపీ నిర్ణయించింది.

## స్వయం సమృద్ధి గ్రామాలే లక్ష్యం

**తెలంగాణ బ్యూరో ప్రతినిధి**



తెలంగాణ గ్రామాలను స్వయం సమృద్ధి, ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాభివృద్ధి కోసం శాఖలు విడివిడిగా కాకుండా ఉమ్మడి ప్రణాళికతో ముందుకు సాగితే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని ఆమె పేర్కొన్నారు. ప్రతి గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని, వచ్చే రెండు నెలల్లో గ్రామ ప్రణాళికలను సిద్ధం చేసి అమలు చేసే కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఐదేళ్లలో గ్రామాలకు భారీగా నిధులు వస్తున్నప్పటికీ వాటిని సమర్థవంతంగా వినియోగించడంలో లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామసభ నిర్వహించకుండా నిబంధనల విరుద్ధంగా నిధులు ఖర్చు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జీపీ నిధులు సరైన మార్గంలో ఖర్చు అయ్యేలా లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్లు పర్యవేక్షించాలని సూచించారు. అటవీ, ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి కేంద్ర అటవీశాఖ అభ్యంతరాలు వ్యక్తం చేయడం వల్ల గిరిజన గ్రామాలు ఇంకా మౌలిక సదుపాయాలకు దూరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు. గ్రామాల్లో చెరువులు, బావులను సంరక్షించాలని, ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మిషన్ భగీరథ నీటిపై ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. గ్రామ అభివృద్ధి తోనే తెలంగాణ పురోగతి పరిపూర్ణమవుతుందని, 1.35 లక్షల మంది సిబ్బంది, రూ.34 వేల కోట్ల వార్షిక బడ్జెట్‌ను సమర్థవంతంగా వినియోగిస్తే అభివృద్ధి చెందిన తెలంగాణను నిర్మించవచ్చని మంత్రి సీతక్క పేర్కొన్నారు. అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ హామీలపై హరీష్ రావు ఫైర్

మొదటి తరువాయి

ధ్వజమెత్తారు. మేమిచ్చిన పంటల బోనస్ 3 సార్ల రైతు బంధు కంటే ఎక్కువ అని మంత్రి జూపల్లి కృష్ణారావు అంటుండు. అసలు జూపల్లికి తెలివి ఉందా..? అని మాజీ మంత్రి మండిపడ్డారు. అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. రెండు బోనస్‌లు అయితే ఎగ్గొట్టినవ్.. పోయిన యాసంగి బోనస్ రూ.1200 కోట్లు, ఈ యాసంగి బోనస్ రూ. 1000 కోట్లు ఎగ్గొట్టినవ్ అని సీఎం రేవంత్ రెడ్డిపై ఫైర్ అయ్యారు. అంతగొడితే నువ్వు బోనస్ ఇచ్చింది రూ.2500 కోట్లు.. కానీ మీరు ఎగగొట్టిన రైతు బంధు విలువ రూ.29,350 కోట్లు అని ధ్వజమెత్తారు. జూపల్లి తెలుసుకో లెక్క. చర్చ పెడదామా.. అసెంబ్లీకి వచ్చి మాట్లాడదాం. నువ్వు ఇచ్చిన బోనస కేవలం 3వేల కోట్లు కూడా దాటదు. నువ్వేమైనా తెలిసి మాట్లాడుతున్నవా.. తెలియక మాట్లాడు తున్నవా..? చిన్న మెదడు ఏమైనా చితికిపోయిందా..? నాకైతే అర్థమైతలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలకు ఎక్కువ.. చేతలకు తక్కువ. ఆయన దగ్గర మూడు శాఖలున్నాయి. విద్యాశాఖ, హోంశాఖ, మున్సిపల్ శాఖ.. ఈ మూడింటిలో కూడా అట్టర్‌ప్లాప్ అయిండని హరీశ్ రావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులుండి చేసింది గుండుసున్నా. రేవంత్ రెడ్డి మూడు శాఖలు పెట్టుకుని చేసింది కూడా గుండు సున్నా. విద్యాశాఖ మంత్రిగా ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణలో రేవంత్ రెడ్డి ఫెయిల్ అయిపోయిండు.. మున్సిపల్ శాఖ, హోంమంత్రిగా ఫెయిల్ అయిండు. కానీ ఒక్క దాంట్లో మాత్రం పాసయ్యిండు. ఢిల్లీకి సంచులు మోసే శాఖలో మాత్రం పాసయ్యిండంటూ ఎద్దేవా చేశారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన హామీలు , వాటిపై ఆయన ఎన్నిసార్లు మాట తప్పారో చూపే ప్రత్యేక వీడియోలను స్క్రీన్‌పై ప్లే చేస్తూ హరీష్ రావు కాంగ్రెస్ తీరును ఎండగట్టారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రెండు పంటలకు రూ. 10 వేలు చొప్పున రైతుబంధు ఇస్తుంటే, తాము అధికారంలోకి వస్తే మూడు పంటలకు రూ. 15 వేలు ఇస్తామని కాంగ్రెస్ నేతలు నమ్మబలికారని హరీష్ రావు విమర్శించారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీని ఎందుకు అమలు చేయలేదని ఆయన నిలదీశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులను పెండింగ్‌లో పెట్టిందని ఆరోపించారు. కరోనా మహమ్మారి వంటి అత్యంత కఠినమైన ఆర్థిక పరిస్థితుల్లో కూడా ఎక్కడా ఆగకుండా 13 లక్షల రైతు కుటుంబాలకు రూ. 73 వేల కోట్ల రైతుబంధు నిధులను సకాలంలో అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని గుర్తు చేశారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా ప్రజలకు ఏం కావాలో ముందే గుర్తించి చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ఇప్పుడు అచ్చంపేట చూసినా, అశ్వారావుపేట చూసినా ప్రజలందరి నోటా 'మళ్లీ కేసీఆర్ రావాలి' అనే మాట ఒక్కటే వినిపిస్తోందని అన్నారు. రెండు లక్షల రైతు రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ఎగ్గొట్టిందని హరీష్ రావు ధ్వజమెత్తారు. భద్రాద్రి రాముడిని సాక్షిగా పెట్టి రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి, చివరకు ఆ దేవుడినే మోసం చేశారని, ఇక ప్రజలను మోసం చేయకుండా ఉంటారా అని ప్రశ్నించారు. త్వరలోనే మధిరలో భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి పాల్గొనే సభకు 'రైతు ఆశీర్వాద సభ' అని పేరు పెట్టడం రైతాంగాన్ని అవమానించడమేనన్నారు. రైతులను మోసం చేసినందుకు గానూ ఆ సభకు 'రైతు క్షమాపణ సభ'గా నామకరణం చేసుకోవాలని హరీష్ రావు ఎద్దేవా చేశారు.

# ఘనంగా డా. శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలు

**కరీంనగర్/మానకొండూర్/గన్నేరువరం/జగిత్యాల, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఒకే దేశం, ఒకే రాజ్యాంగం, ఒకే జెండా లక్ష్యంతో కాశ్మీర్ సమగ్రత కోసం ప్రాణత్యాగం చేసిన భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డా. శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా బీజేపీ శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించారు. కరీంనగర్‌లో డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సేవలను స్మరించిన రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మేయర్, ప్రస్తుత డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్, ఆంజనేయులు బాలు, మహేందర్, తిరుపతి, మల్లయ్య, రాజయ్య, రోహిత్, సాయి తదితరులు



హాజరయ్యారు. మానకొండూర్‌లో కూడా బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో 125వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. నాయకులు మాట్లాడుతూ దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, ఇద్దరు ప్రధానమంత్రులు ఉండరాదని నినాదం చేస్తూ దేశ సమైక్యత కోసం ఆయన చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి భారతీయుడు ఆదర్శంగా తీసుకుని దేశభక్తి, జాతీయ సమైక్యత కోసం ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. గన్నేరువరం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో కూడా వర్ధంతి వేడుకలు జరిగాయి. ఆయన మాట్లాడుతూ జమ్మూ--కాశ్మీర్ సంపూర్ణ విలీనానికి శ్యామాప్రసాద్ ముఖర్జీ చేసిన పోరాటం భారత చరిత్రలో చిరస్మరణీయమని, 1953 జూన్ 23న దేశ సమైక్యత కోసం చేసిన పరమ త్యాగం ఎప్పటికీ మరువలేనిదని తెలిపారు. ఆయన ఆశయాలు నేటి యువతకు మార్గదర్శకమని పేర్కొన్నారు. జగిత్యాలలో జిల్లా కార్యాలయంలో కూడా బలిదాన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ దేశ ఏకత్వం, అఖండ భారత లక్ష్యాల సాధనకు ఆయన చేసిన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు వేదికల్లో విత్తన మేళా

**చిగురుమామిడి/పాలకుర్తి/తిమ్మాపూర్/అక్కన్నపేట/హుజూరాబాద్, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు వేదికల్లో విత్తన మేళాలు ఘనంగా నిర్వహించారు. చిగురుమామిడి మండలంలోని సుందరగిరి గ్రామంలో జరిగిన మేళాలో సన్న వడ్లు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విత్తనాలు, అలాగే నానో యూరియా, నానో డీఏపీ రైతులకు అందుబాటులో ఉంచారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. పాలకుర్తి మండల కేంద్రంలో కూడా విత్తన మేళా ప్రదర్శన జరిగింది. రైతులకు వివిధ రకాల విత్తనాలను చూపించి నాటే పద్ధతులను వివరించారు. ఎల్నినో ప్రభావం వల్ల వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన ఏడు రకాల వరి సన్న వడ్ల విత్తనాలు మాత్రమే నాటాలని తెలిపారు. తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట రైతు వేదికలో కూడా విత్తన మేళా జరిగింది. రైతులకు నాణ్యమైన వరి విత్తనాలు, నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై అవగాహన కల్పించారు.



ఆధునిక సాగు విధానాలు, ఎరువుల వినియోగం వల్ల ఖర్చులు తగ్గడం, దిగుబడి పెరగడం వంటి అంశాలను వివరించారు. హుస్నాబాద్ నియోజకవర్గ అక్కన్నపేట మండల కేంద్రంలో కూడా విత్తన మేళా ఘనంగా జరిగింది. రైతు ఆత్మ కమిటీ చైర్మన్ జంగపల్లి ఐలయ్య ప్రారంభించిన ఈ కార్యక్రమంలో సన్న వడ్లు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, ఉత్పాదకత పెంపు, సాగు వ్యయాల తగ్గింపు, అధిక దిగుబడుల సాధన కోసం చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. హుజూరాబాద్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్‌రావు మాట్లాడుతూ మంచి విత్తనం మంచి పంటకు మొదటి మెట్టు, రైతు విజయానికి పునాది అని, నాణ్యమైన విత్తనం రైతు చెమటకు విలువ తెస్తుందని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, విత్తన డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

# కాల్వ శ్రీరాంపూర్, ముత్తారం భూ సమస్యలపై కలెక్టర్ దృష్టి



**పెద్దపల్లి, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కాల్వ శ్రీరాంపూర్ తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష సమావేశం నిర్వహించారు. వెన్నంపల్లి గ్రామంలోని ప్రభుత్వ భూముల సర్వేను త్వరగా పూర్తి చేసి, అర్హులైన పేదలకు పట్టాలు అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. పెద్దంపేటలో గోదాం నిర్మాణానికి గుర్తించిన 10 ఎకరాల భూమి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, నరేగా కింద మంజూరైన సీసీ రోడ్ల పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తరువాత ముత్తారం మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో సీలింగ్ భూములను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో తహసీల్దార్లు డా. రాముడు, మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు



**రామడుగు, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రామడుగు గ్రామ సర్పంచ్ మొయిజ్, ఉప సర్పంచ్ రాజ్‌కుమార్, వార్డు సభ్యులతో పాటు వివిధ పార్టీలకు చెందిన 50 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కరీంనగర్‌లోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే సత్యం వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని, అందుకే ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. చొప్పదండి నియోజకవర్గాన్ని రాష్ట్రానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని, ప్రజలకు ప్రతి ఇంటిలో పెద్దకొడుకుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే సత్యం స్పష్టం చేశారు.

## గేట్ వాల్ డ్రైనేజీని పునరుద్ధరించి శాశ్వత పరిష్కారం చూపించాలని రైతుల డిమాండ్



**రామడుగు, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

శ్రీరాములపల్లి గ్రామంలోని కాసారపు కుంట వద్ద గేట్ వాల్ డ్రైనేజీని కూల్చి, చెరువు మట్టిని తరలించి మూడు మీటర్ల మట్టికట్ట నిర్మించడంతో క్రింద ఉన్న పొలాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ, అధిక వర్షాలు కురిస్తే నీటి ఒత్తిడి పెరిగి ఇసుక మేటలు ఏర్పడి పంటలకు నష్టం కలుగుతుందని తెలిపారు. గతంలో చెరువు కట్ట వెంబడి ఉన్న బాట కనుమరుగై, నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఇరిగేషన్ వర్క్ ఇన్స్పెక్టర్ మల్లయ్య మాట్లాడుతూ, ఇరు వర్గాలను పిలిచి హెచ్చరించినట్లు, రైతులకు నష్టం కలగకుండా గేట్ వాల్ డ్రైనేజీని పునరుద్ధరించి శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. రైతులు తక్షణమే సమస్యను పరిష్కరించాలని అధికారులను పత్రిక ద్వారా కోరుతున్నారు.

## ప్రశాంతంగా సాగిన పాఠశాలల బంద్

**ఖానాపూర్, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని, ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఇచ్చిన పిలుపుతో సోమవారం ఖానాపూర్ మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలు మూతపడ్డాయి. బంద్ ప్రశాంతంగా సాగింది. ప్రైవేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తూ సామాన్య ప్రజలపై భారాన్ని మోపుతున్నాయని నాయకులు ఆరోపించారు. ప్రభుత్వ కమిటీలు ఉన్నప్పటికీ ఫీజుల నియంత్రణలో విఫలమవుతున్నాయని, ఇకనైనా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని మానపల్లి దినేష్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు యథావిధిగా నడిచాయి.

## వైభవంగా కోట మైసమ్మ విగ్రహ ప్రతిష్ట వేడుకలు



**ఆమనగల్లు, జూన్ 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

మాడుగుల మండలం నల్లవారి పల్లి గ్రామంలో కోట మైసమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట వేడుకలు మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. దశాబ్దాల క్రితం నిర్మించిన దేవాలయం శిథిలావస్థకు చేరుకోగా గ్రామానికి చెందిన దివంగత ఇటికాల కిషన్ రెడ్డి కుటుంబికులు నూతన దేవాలయ నిర్మాణం చేపట్టారు. విగ్రహా ప్రతిష్ట నేపథ్యంలో దేవాలయాన్ని పచ్చటి తోరణాలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయామనంగా అలంకరించారు. వివిధ ప్రాంతాలలో ఉన్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో గ్రామానికి తరలివచ్చారు. అర్చకులు సీతారామ శర్మ , నాయనా చారి ఆధ్వర్యంలోని అర్చక బృందం శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. విగ్రహా ప్రతిష్ట అనంతరం మైసమ్మ దేవతను దర్శించుకుని భక్తులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జగన్, ఉపసర్పంచ్ మధుసూదన్, నాయకులు జగన్ రెడ్డి, హనుమంత రెడ్డి, వెంకట్ రెడ్డి, అంజయ్య, సంపత్, విజయమ్మ, వెంకటమ్మ ,అండాలు, సరిత, ఆదిత్య, సువర్ణ, యాదగిరి రెడ్డి, సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నారాయణరెడ్డి, శశికళ, సంధ్య, జంగయ్య, మల్లయ్య, అరవింద్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, శ్రీను, సందీప్ రెడ్డి, సంజీవరెడ్డి, వెంకటయ్య, సుఖ జీవన్ రెడ్డి, సునీత, పద్మమ్మ, పాండు, కృష్ణయ్య, వీరారెడ్డి, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

## శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**నాగోల్, జూన్ 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

నాగోల్ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, గొప్ప జాతీయవాది, విద్యావేత్త మరియు దేశ సమైక్యత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చింతల సురేందర్ యాదవ్ నాగోల్ డివిజన్ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి వారి సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యత, జాతీయ సమగ్రత కోసం చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. "ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, రెండు ప్రధానులు ఉండకూడదు" అనే సిద్ధాంతంతో పోరాడి దేశ సమగ్రత కోసం తన ప్రాణాలను అర్పించిన మహానేతగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధి, జాతీయత భావాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ త్యాగాలు, సేవలు భారతీయ జనతా పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కేసిరెడ్డి పద్మ రెడ్డి, బీజేపీ నాయకులు బద్దం బాలకృష్ణ, వస్పరి మల్లేష్, సంజీవరెడ్డి, వినోద్ రెడ్డి, పంగ శ్యామ్ కుమార్, శ్రీనివాస్, రావుల శ్రీనివాస్ గౌడ్, సాయి కుమారి, సరస్వతి, వినోద్ యాదవ్, నరేష్ యాదవ్, శివశంకర్, విజయశంకర్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రైవేట్ కాలేజీల ఫీజుల దోపిడీపై ఆందోళన



**కరీంనగర్, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

విద్యను వ్యాపారంగా మార్చి, ఇప్పుడు రాజకీయ వేదికగా ఉపయోగించుకోవడం ఆందోళనకరమని కాంగ్రెస్ పార్టీ డీసీసీ సెక్రటరీ, 55వ డివిజన్ అధ్యక్షుడు జెల్లోజి శ్రీనివాస్ పటేల్ తీవ్రంగా విమర్శించారు.కొన్ని బడా ప్రైవేట్ కాలేజీలు విద్యార్థుల ర్యాంకులు, తల్లిదండ్రుల కష్టార్జిత సంపాదన, అధ్యాపకుల శ్రమను రాజకీయ ప్రభావం పెంచుకునే సాధనాలుగా మార్చుకుంటున్నాయనే ఆరోపణలు ప్రజల్లో వినిపిస్తున్నాయని ఆయన తెలిపారు. విద్యాసంస్థలు జ్ఞాన మందిరాలుగా ఉండాలి కానీ రాజకీయ వేదికలుగా మారకూడదని హెచ్చరించారు.ప్రభుత్వం పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలను బలోపేతం చేస్తుండగా, ప్రైవేట్ యాజమాన్యాలు లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై భారాన్ని మోపుతున్నాయని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయ చదరంగం ఆడే హక్కు ఎవరికీ లేదని, ప్రజలు ఇక మౌనంగా ఉండరని స్పష్టం చేశారు.విద్యను కాపాడటం అంటే భవిష్యత్తును కాపాడటమేనని, విద్యాసంస్థలను రాజకీయ అడ్డాలుగా మార్చే ప్రయత్నాలను అడ్డుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పటేల్ పిలుపునిచ్చారు.

## పెద్దమ్మ తల్లి బోనాల జాతరకు పూర్తి వసతులు కల్పిస్తాం

**- డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు**



**కరీంనగర్, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

హస్నాపూర్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రామచంద్రాపూర్ కాలనీలో జూలై 5న పెద్దమ్మతల్లి బోనాల జాతర ఘనంగా జరగనుంది. ఆలయ కమిటీ భక్తుల సౌకర్యార్థం టెంట్లు, కుర్చీలు, త్రాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ వంటి మౌలిక వసతులు కల్పించాలని నగరపాలక సంస్థను కోరింది.ఈ విజ్ఞప్తికి స్పందించిన డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు జాతరను ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా త్రాగునీటి ఏర్పాటు, టెంట్లు, ప్రత్యేక విద్యుత్ దీపాలు, పరిశుభ్రత చర్యలు చేపడతామని తెలిపారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కుంభం మల్లయ్య, ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, ఉపాధ్యక్షుడు జడిగాల రాజయ్య, కోశాధికారి గంది శ్రీనివాస్, సభ్యులు ఇట్టవేణి భద్రయ్య, బీమరి నాగరాజు, కుంభం అనీల్ కుమార్, ఇట్టవేణి కిరణ్, కుంభం చిరంజీవి, నిమ్మల సురేష్ పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనంపై కలెక్టర్ తనిఖీ



**సిద్దిపేట, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణను జిల్లా కలెక్టర్ కె. హైమావతి మంగళవారం పరిశీలించారు.కిచెన్‌లో వంట జరుగుతున్న ఆహార పదార్థాలను తనిఖీ చేసి అన్నం, కూరలు, పప్పు, సాంబార్ నాణ్యతను పరీక్షించారు. విద్యార్థులకు అందించే భోజనం రుచికరంగా, పోషకాహారంతో ఉండాలని సూచించారు. మొక్కుబడిగా వంట చేస్తే సహించబోమని హెచ్చరించారు. వంటగది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించి, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల హాజరుకు అనుగుణంగా వంట సరుకులు వినియోగించి, పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.

## మండలంలో ఏబీవీపీ బంద్ సంపూర్ణం

**ఎలిగేడు, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఇచ్చిన బంద్ పిలుపు మేరకు ఎలిగేడు మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు బుధవారం మూతపడ్డాయి.ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు పాఠశాలలను బంద్ చేయించి, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. బంద్ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

**-ఎబీవీపీ డిండి శాఖ ఆధ్వర్యంలో బంద్ విజయవంతం**



**దేవరకొండ, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

డిండి మండల కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబీవీపీ) ఆధ్వర్యంలో విద్యాసమస్యలపై పాఠశాలల బంద్ పిలుపు విజయవంతమైంది. ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు మూతపడగా, విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఎబీవీపీ నాయకుడు రాఘవేంద్ర మాట్లాడుతూ, “రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యను బలోపేతం చేస్తామని, మౌలిక వసతులు కల్పిస్తామని ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించినా, విద్యాసంవత్సరం ప్రారంభమైనా ఇప్పటికీ స్కూల్ దుస్తులు పంపిణీ చేయకపోవడం, నిధులు మంజూరు చేయకపోవడం బాధాకరం” అని ఆవేదన వ్యక్తం చేశారు.అతను మరింతగా పేర్కొంటూ, “27,000 ప్రభుత్వ పాఠశాలల్లో 23,000 పాఠశాలలను మూసివేస్తామన్న ముఖ్యమంత్రి ప్రకటనను వెంటనే ఉపసంహరించుకోవాలి. విద్యార్థుల భవిష్యత్తు కోసం మౌలిక వసతులు కల్పించి, పాఠశాలలను బలోపేతం చేయాలి” అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీనాథ్, రాజేష్ చారీ, నాగరాజు, హైమద్, చరణ్ గౌడ్, చందు, సాయి గౌడ్, శేషాద్రి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు వేదికలలో విత్తన మేళా

**-నాణ్యమైన విత్తనాల అందుబాటే లక్ష్యం**

**-- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**



**మిర్యాలగూడ, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

రైతులకు నాణ్యమైన విత్తనాల అందుబాటును కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో రైతు వేదికలలో నిర్వహిస్తున్న విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు.ఈ నెల 23 నుండి 30వ తేదీ వరకు జరిగే మేళాలో వరి, పప్పు ధాన్యాలు, సోయాబీన్, కూరగాయల విత్తనాలు, నానో యూరియా, నానో డి.ఏ.పీ. వంటి ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ధృవీకరించబడిన విత్తనాలను వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు.రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తూ పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆయన అన్నారు. మిర్యాలగూడ క్లస్టర్ రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**నాగర్‌కర్నూల్, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా నాగర్‌కర్నూల్ బస్టాండ్ కూడలి ప్రాంతంలో ఘన నివాళులర్పించారు. టౌన్ ప్రెసిడెంట్ చెవ్వ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, “ముఖర్జీ 1901లో కలకత్తాలో జన్మించారు. 33 ఏళ్ల వయసులోనే విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్‌గా నియమితులయ్యారు. 1951లో జనసంఘ్‌ను స్థాపించారు. నెహ్రూ--లియాకత్ ఒప్పందానికి వ్యతిరేకంగా మంత్రి పదవికి రాజీనామా చేశారు. దేశంలో రెండు విధానాలు, రెండు జెండాలు ఉండకూడదని గట్టిగా నినాదించారు. 370 ఆర్టికల్‌కు వ్యతిరేకంగా పోరాడుతూ జమ్మూ కాశ్మీర్‌లో అరెస్టై, 1953 జూన్ 26న జైలులో అనుమానాస్పదంగా మరణించారు” అని వివరించారు.అతను మరింతగా పేర్కొంటూ, “ముఖర్జీ త్యాగానికి గుర్తుగా జమ్మూ కాశ్మీర్‌లోని చెనేనీ--నిశ్రా సొరంగ మార్గానికి ఆయన పేరు పెట్టారు. ఆయన త్యాగం వలన మనం స్వేచ్ఛావాయువులు పీలుస్తున్నాం. నేడు నరేంద్ర మోడీ గారి నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోంది” అని అన్నారు.ఈ సందర్భంగా ముఖర్జీ చిత్రపటానికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టౌన్ మాజీ అధ్యక్షులు ఎలిమె రాము, రాజేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు సైదులు, చటమోని రాము, వేణు, శ్రీనివాసులు, మల్లారెడ్డి, లక్ష్మయ్య, ప్రగతి గౌడ్, పస్తాం బాబు, తాడూరు మండల అధ్యక్షుడు సుదర్శన్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇన్నోవా కార్ చోరీ కేసును చేదించిన పోలీసు శాఖ





**కరీంనగర్, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

గణేష్ నగర్‌లో జరిగిన టయోటా ఇన్నోవా కార్ చోరీ కేసును కరీంనగర్ I టౌన్ పోలీసులు చేదించారు. ఈ కేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. ఫిర్యాదుదారు కల్లేపల్లి జానీ ఇంటి వద్ద పార్క్ చేసిన కారును నిందితులు దొంగలించి, అందులో ఉన్న రూ.42,000 నగదు, శాంసంగ్ గెలాక్సీ ఫోల్డ్-4 మొబైల్, రెండు హెచ్డిఎఫ్సి చెక్కులు, చెక్‌బుక్, బ్యాంక్ పాస్‌బుక్‌ను అపహరించారు. దర్యాప్తులో నిందితులు కారును విజయవాడలో అమ్మేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో కరీంనగర్ బైపాస్‌లో ఆటోనగర్ వద్ద పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. దొంగిలించిన కారు, నగదు, మొబైల్, చెక్కులు, చెక్‌బుక్, పాస్‌బుక్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును ఇన్స్పెక్టర్ కె. రామచందర్‌రావు పర్యవేక్షణలో పోలీసులు విజయవంతంగా చేదించారు.

## 9వ వార్డులో డ్రైనేజ్ సమస్యలపై వినతి



**పెద్దపల్లి, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

పెద్దపల్లి పట్టణంలోని తొమ్మిదో వార్డులో డ్రైనేజ్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని బిఆర్ఎస్ నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.వర్షాకాలంలో డ్రైనేజీలు లేకపోవడం, ఉన్న డ్రైనేజీలు సరిగా పనిచేయకపోవడం వల్ల వర్షపు నీరు రోడ్లపై, ఇళ్లలోకి చేరి నిలిచిపోతుందని వారు తెలిపారు. నీటి నిల్వ కారణంగా దోమలు, కీటకాలు పెరిగి ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఉన్న డ్రైనేజీలను వెంటనే శుభ్రం చేయడంతో పాటు, డ్రైనేజీలు లేని చోట కొత్త నిర్మాణాలు చేపట్టాలని బిఆర్ఎస్ నాయకులు సయ్యద్ జుబేర్, ఎండి అత్తర్, సయ్యద్ ఫర్హాన్ కోరారు.

## ఘనంగా డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన దినోత్సవం





**కరీంనగర్, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు అనుగుణంగా మోదీ ప్రభుత్వం దేశ సమగ్రత, ఐక్యత దిశగా అడుగులు వేస్తోందని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన బలిదాన దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్టికల్ 370 రద్దు చేయడం ద్వారా ఆయన కలలను నెరవేర్చామని, దేశంలో కాంగ్రెస్ ముక్త్ భారత్ సమయం దగ్గరలోనే ఉందని పేర్కొన్నారు.హుజురాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, “ఒకే దేశం, ఒకే జెండా, ఒకే రాజ్యాంగం” లక్ష్యంతో పోరాడిన గొప్ప దేశభక్తుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. ఆయన చేసిన త్యాగం భారత రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. మోదీ ప్రభుత్వం ఆయన ఆశయాలకు అనుగుణంగా పని చేస్తోందని, ఆర్టికల్ 370 రద్దు చేసి ఆయనకు ఘన నివాళి అర్పించిందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిఎన్టి హాస్టల్ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ డిమాండ్

**-ప్రహరీ గోడ, మంచినీటి సౌకర్యం కల్పించాలని బుడగ వెంకటేష్**



**దేవరకొండ, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జూన్ 23 నుంచి 28 వరకు జరుగుతున్న హాస్టల్స్--స్కూల్స్ సర్వేలో భాగంగా దేవరకొండ పట్టణంలోని ఎస్టీ ఏ1 హాస్టల్, డిఎన్టి హాస్టల్లో విద్యార్థుల సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడగ వెంకటేష్ మాట్లాడుతూ, "నూతన అకాడమిక్ ఇయర్ ప్రారంభమైనా, పాత సమస్యలతోనే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా డిఎన్టి హాస్టల్‌లో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడం సరైంది కాదు" అని ఆవేదన వ్యక్తం చేశారు. అతను మరింతగా పేర్కొంటూ, "హాస్టల్ మరుగుదొడ్లు శిధిలావస్థలో ఉన్నాయి. డోర్లు కూడా పనికిరాని స్థితిలో ఉన్నాయి. గతంలో అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. తక్షణమే ప్రహరీ గోడ నిర్మించి, మంచినీటి సౌకర్యం కల్పించి విద్యార్థులకు న్యాయం చేయాలి" అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఏ. త్రిశాంత్, ఆర్. అశోక్, ఎన్. అరవింద్, ఎన్. అఖిల్, వి. గణేష్, జైరాం తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థుల ఆందోళన



**మర్రిగూడ, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మంగళవారం మర్రిగూడ మండల కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో విద్యాసంస్థలు బంద్ నిర్వహించబడ్డాయి. నగర కార్యదర్శి సందీప్ ధర్మ మాట్లాడుతూ, "23 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటనను వెంటనే ఉపసంహరించుకోవాలి. ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి. ఖాళీగా ఉన్న ఎంఈఓ, డిఈఓ పోస్టులతో పాటు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలి. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన భోజనం అందించాలి" అని డిమాండ్ చేశారు. "ప్రభుత్వ పాఠశాలను కాపాడుకుందాం -- ప్రైవేట్ పాఠశాల దోపిడిని అరికడదాం" అంటూ విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పానుగంటి తేజ, రోహిత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## మర్రిగూడలో వేలాడుతున్న నిఘా నేత్రాలు

**-సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ప్రజల్లో ఆందోళన**







**మర్రిగూడ, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలో నేరాల నియంత్రణలో కీలకమైన సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. బస్టాండ్ సమీపంలోని రాజీవ్ గాంధీ విగ్రహం, బేకరీ షాపు వద్ద హైమాక్స్ లైట్ స్తంభం, అలాగే చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మూడు కెమెరాలు కొంతకాలంగా పనిచేయకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఈ మధ్యకాలంలో ఈదురుగాలుల కారణంగా కెమెరాలు స్తంభాలపై వేలాడుతూ కనిపిస్తున్నాయి. ఫలితంగా వాహన దొంగతనాలు, ఆకతాయి అల్లర్లు, రోడ్డు ప్రమాదాల నియంత్రణ కష్టంగా మారింది. ప్రజలు నిత్యం ఈ ప్రాంతంలో తిరుగుతుండటంతో భద్రతా లోపం మరింతగా ఆందోళన కలిగిస్తోంది. ప్రజలు అధికారులు వెంటనే స్పందించి పనిచేయని సీసీ కెమెరాలను మరమ్మతులు చేసి, నేరాల నివారణకు సమర్థంగా ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ప్రభుత్వం విద్యార్థుల సమస్యలపై వెంటనే స్పందించాలి

**-ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్**



**దేవరకొండ, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్రవ్యాప్త పాఠశాలల బంద్ పిలుపు మేరకు దేవరకొండ పరిధిలో ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు విజయవంతంగా బంద్ నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా డిఆర్ఎస్ ప్రైవేట్ పాఠశాల సమాచార లోపంతో నడపబడగా, అక్కడికి చేరుకున్న ఏబీవీపీ కార్యకర్తలు నిరసనగా ఫర్నిచర్ ధ్వంసం చేశారు. రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ, "విద్యార్థుల హక్కులు, నాణ్యమైన విద్య కోసం ఏబీవీపీ నిరంతరం పోరాటం చేస్తోంది. ప్రభుత్వం విద్యారంగ సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. అతను మరింతగా పేర్కొంటూ, "ప్రభుత్వం 27,000 స్కూళ్లలో 23,000 మూసివేస్తామన్న ముఖ్యమంత్రి ప్రకటనను ఉపసంహరించుకోవాలి. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో విచ్చలవిడి ఫీజుల దోపిడిని అరికట్టి ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి. ఖాళీగా ఉన్న ఎం.ఈ.ఓ, డిఈఓ పోస్టులతో పాటు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించి, యూనిఫామ్స్ వెంటనే అందించాలి. గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి. ప్రైవేట్ స్కూల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో జరుగుతున్న బుక్స్, యూనిఫామ్స్ విక్రయాలను నిషేధించాలి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ స్కూళ్లలో బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలు చేయాలి" అని స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలు పూర్తిగా పరిష్కరించే వరకు ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని గోపీచంద్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు గుండాల శివరామరాజు, యలమల హేమ సుందర్, లింగాల రాకేష్, ఇస్లావత్ రామ్ చరణ్, సాయి, బిట్టు, హరి, అరవింద్, శివ, రోహిత్, రాము తదితరులు పాల్గొన్నారు.

# పంటల మార్పిడిపై రేవంత్ సర్కారు ఫోకస్

**-రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటుకు రైతు కమిషన్ సిఫార్సు**



**హైదరాబాద్, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వాతావరణ మార్పులు, భూసార క్షీణత, నీటి కొరత, మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని తెలంగాణలో పంటల మార్పిడిని ప్రభుత్వ విధానంగా అమలు చేయాలని రైతు కమిషన్ సూచించింది. ఈ మేరకు రూపొందించిన నివేదికను ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు సమర్పించినట్లు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో కూరగాయల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోవడం ఆందోళనకరమని ఆయన పేర్కొన్నారు. ఉద్యాన పంటల విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ అవసరమని, విజయవంతంగా అమలు చేయాలంటే రాష్ట్రస్థాయి కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని సిఫారసు చేశారు. నాబార్డ్ సహకారం, కేంద్ర పథకాల వినియోగం, మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ వంటి పథకాల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ యంత్రాలపై జీఎస్టీని పూర్తిగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, రాములు నాయక్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో అధిక దిగుబడి ఇచ్చే పంటలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలను ప్రోత్సహించాలని సూచించారు. పప్పుధాన్యాలకు బోనస్ ప్రకటించాలని, నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందించాలని సిఫారసు చేశారు. వరుసగా వరి సాగు చేయడం వల్ల భూసారం క్షీణిస్తోందని, పంటల మార్పిడి ద్వారానే భూమి సారవంతతను కాపాడుకోవచ్చని తెలిపారు. పంటల మార్పిడి అనేది కేవలం పంటల మార్పు మాత్రమే కాకుండా, భూసార పరిరక్షణ, నీటి వినియోగ సామర్థ్య పెంపు, రైతుల ఆదాయ వృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయాన్ని తీర్చిదిద్దే సమగ్ర వ్యూహమని రైతు కమిషన్ స్పష్టం చేసింది.

# మర్రిగూడలో బి.ఎల్.ఓ-బి. ఎల్.ఏల సంయుక్త శిక్షణ

**-ఓటర్ జాబితా సవరణపై అధికారులు అవగాహన**



**మర్రిగూడ, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని విజయ గార్డెన్‌లో మంగళవారం బూత్ స్థాయి అధికారులు, బి.ఎల్.ఓలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లతో (బి.ఎల్.ఏలు) ప్రత్యేక సంయుక్త శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఏఈఆర్ఓ ఓ మర్రిగూడ తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, మాస్టర్ ట్రైనర్ వెంకటేశ్వర్లు సంయుక్తంగా నిర్వహించారు. తహసిల్దార్ మాట్లాడుతూ, "భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జూన్ 25 నుండి జూలై 24 వరకు ఇంటింటి సర్వే జరుగుతుంది. ఓటర్లు పూరించిన ఎన్యుమరేషన్ ఫారాలను జూలై 24లోపు బి.ఎల్.ఓలకు అందజేయాలి. గడువులోపు సమర్పించని వారి పేర్లు ముసాయిదా జాబితాలో ఉండవు. జూలై 31న ముసాయిదా జాబితా విడుదలై, క్లెయిమ్లు--అభ్యంతరాల పరిశీలన అనంతరం అక్టోబర్ 1న తుది జాబితా ప్రచురించబడుతుంది" అని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా, జాబితాలో తప్పులు లేకుండా బి.ఎల్.ఓలు--బి.ఎల్.ఏలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని బి.ఎల్.ఓలు, వివిధ పార్టీల అధ్యక్షులు, ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# డా.శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆశయాలను కొనసాగిద్దాం



**కల్వకుర్తి, జూన్ 23(నీలగిరి ఎక్స్ ప్రెస్)** భారతీయ జనతా పార్టీ పూర్వరూపం భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా మంగళవారం కల్వకుర్తి భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బిజెపి నాయకులు కార్యకర్తలు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘనమైన నివాళులు అర్పించి పుష్పాంజలి సమర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ భారత స్వాతంత్రం కోసం పోరాటమే కాకుండా స్వతంత్ర భారతదేశంలో కశ్మీర్ విభజనను వ్యతిరేకిస్తూ ఈదేశంలో కాంగ్రెస్ హిందూ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ దేశవ్యాప్తంగా హిందువులలో చైతన్యం తీసుకురావాలని 1951లో అక్టోబర్ 21న భారతీయ జన సంఘ్ పార్టీని స్థాపించారు కాశ్మీర్లో రెండు జాతీయ జెండాలు రెండు రాజ్యాంగాలు ఇద్దరు ప్రధాన మంత్రులుకు వ్యతిరేకంగా ఏక్ దేశ్ మే దోనిషాన్ దోవిధాన్ దోప్రధాన్ నహి చలేంగా అంటూ ఉద్యమం తీసుకొచ్చి కాశ్మీర్ ముట్టడికి ప్రయత్నిస్తున్న సందర్భంలో కశ్మీర్ పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి అక్రమంగా నిర్బంధించి పోలీసుల నిర్బంధంలో 1953 జులై 23న అనుమానస్పద మృతి చెందారు ఇప్పటికీ ఆయన మృతి మిస్టరీగానే మిగిలిపోయింది తన జీవితమంతా భారతదేశ ఔనత్యానికి మరియు హిందువుల ఐక్యత కోసం పరితపించారు కాబట్టి ఆయన అడుగుజాడల్లో నడిచి ఆ మహానుభావుడి ఆశయాలను కొనసాగించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి పట్టణ అధ్యక్షులు గన్నోజు బాబిదేవ్ జిల్లా ఉపాధ్యక్షులు కౌన్సిలర్ బోడ నర్సింహా,కౌన్సిలర్ ఎనోగొండ రామకృష్ణ, సీనియర్ నాయకులు సూర్య కృష్ణ గౌడ్, సురేందర్ గౌడ్, గుండోజు గంగాధర్,జిల్లా బీజేవైఎం నాయకులు నరేష్ చారీ, పట్టణ ఉపాధ్యక్షులు అభి గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి పెద్దారి పర్వతాలు, నాయకులు దేవర్ల మహేష్,హుస్సేన్,రాగిపాణి కాళిదాసు,తోడేటి అరవింద్ రెడ్డి,కొమ్మగొని సాకేత్ గౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వ దృష్టి

**-బీఆర్ఎస్ నేతలకు నైతిక హక్కు లేదని కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి విజయ్ కుమార్ రెడ్డి వ్యాఖ్య**



**కల్వకుర్తి, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీఆర్ఎస్ నేత హరీష్ రావు రైతు భరోసా, పంటల కొనుగోలు, రుణమాఫీపై చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించినట్లు కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ, రైతుల సంక్షేమంపై మాట్లాడే ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో అన్నదాతలకు చేసిన అన్యాయం, నెరవేర్చని హామీల గురించి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విజయ్ కుమార్ రెడ్డి పేర్కొంటూ, హరీష్ రావు చేస్తున్న విమర్శలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ పారదర్శకంగా వ్యవహరిస్తోందని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం రైతులను అప్పులపాలు చేసి మోసం చేసిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, రుణమాఫీ, పంటల కొనుగోలు వంటి అంశాల్లో రైతులకు అండగా నిలుస్తోందని స్పష్టం చేశారు. ఈసారి రాష్ట్రంలో 1.40 కోట్ల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వచ్చిందని, అందులో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే 51 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి, మిగిలిన 24 లక్షల మెట్రిక్ టన్నులను త్వరలోనే కొనుగోలు చేయనుందని వివరించారు. రెండున్నరేళ్లలో రైతులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ. 1.53 లక్షల కోట్ల ఆర్థిక సహాయం అందించిందని, వరి రైతుల ఖాతాల్లోనే రూ. 45 వేల కోట్లకు పైగా జమ చేసిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదేనని తెలిపారు. రైతు సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకుని, రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు, రైతు భరోసా, రుణమాఫీ, పంట నష్ట పరిహారం వంటి పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. అసత్య ప్రచారాలతో రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకుని ప్రజల తీర్పును గౌరవించాలని బీఆర్ఎస్ నేతలను కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్, తాలూకా కార్యదర్శి జంగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు విత్తన మేళాను సద్వినియోగం చేసుకోవాలి

**-ఎలిగేడు మండల వ్యవసాయశాఖ అధికారి ఉమాపతి సూచన**



ధూళికట్ట రైతు వేదికలో విత్తనాల మేళ నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు


ఆయిల్ ఫామ్ గెల ప్రదర్శిస్తున్న ఏవో ఉమాపతి

**ఎలిగేడు, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు రైతు వేదికలలో నిర్వహిస్తున్న విత్తన మేళాను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఎం. ఉమాపతి పిలుపునిచ్చారు. ధూళికట్ట గ్రామంలోని రైతు వేదికలో దృశ్యశ్రవణ మాధ్యమం ద్వారా ఏర్పాటు చేసిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం సూచించిన ఏడు సన్న రకాల వరిని సాగు చేస్తే రైతులు బోనస్ పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా వరి సన్న రకాల విత్తనాలు, నానో యూరియా, నానో డీఏపీ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. అలాగే ఆయిల్‌పామ్ గెల ప్రదర్శన ఏర్పాటు చేసి, ఆయిల్‌పామ్ సాగు విధానం, లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు శరణ్య, సురేశ్, ఆయిల్‌పామ్ అధికారి అభిలాష్, తెలంగాణ తొలి జాతీయ యువజన అవార్డు గ్రహీత యువ రైతు కొండ రవియాదవ్, సింగిల్ విండో డైరెక్టర్ పోల్సాని పుల్లారావు, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

## రైతులను ఆగం చేస్తున్న ప్రభుత్వం

**- మండల అధ్యక్షుడు అర్జున్ రావు**



**ఆమనగల్లు, జూన్ 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని ఆగం చేస్తుందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అర్జున్ రావు అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్, అనంతుల సైదులు గౌడ్ లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుబంధు ఎప్పుడు, ఎంత వేస్తుందో రైతులకు అర్థం కావడం లేదన్నారు. రెండు నెలలుగా ధాన్యం కొనుగోళ్లు చేస్తూ రైతులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరపించారు. అప్రకటిత కరెంటు కోతలతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు నీటి తీరువా రద్దు చేయడంతో పాటు భూగర్భ జలాలను పెంచి రైతాంగానికి, వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇవ్వడం, ఎకరాకు రూ. 5వేల పెట్టుబడి సాయం అందించి రైతులు పండించిన పంటను ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేసినట్లు గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో రైతులు అన్ని రకాల ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రెండున్నర ఏళ్ల రేవంత్ రెడ్డి పాలన రైతులకు పీడకలగా మారిందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో రైతులు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని బొందపెట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు పరమేష్, మహేష్ తదితరులు ఉన్నారు.

## నేడు ఎలిగేడు మండల టాస్క్ ఫోర్స్ సమావేశం




**ఎలిగేడు, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎలిగేడు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ రోజు మధ్యాహ్నం 2 గంటలకు మండల టాస్క్ ఫోర్స్ సమావేశం జరగనుందని మెడికల్ ఆఫీసర్ నిస్సీ క్రిస్టీనా తెలిపారు. ఈ సమావేశాన్ని ఎంపీడీవో, తహసీల్దార్, మెడికల్ ఆఫీసర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఐసీడీఎస్ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని అధికారులు కోరారు.

## జాతీయ స్థాయి సామాజిక సేవకుల సమావేశానికి కొండ రవియాదవ్

**-ఢిల్లీలో అందుకోనున్న జాతీయ గౌరవ్ సమ్మన్ సర్టిఫికెట్**



**ఎలిగేడు, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఈనెల 26న ఢిల్లీలో జరగనున్న ఆల్ ఇండియా జాతీయ యువజన అవార్డు గ్రహీతల సంఘం సమావేశానికి తెలంగాణ రాష్ట్ర తొలి జాతీయ యువజన అవార్డు గ్రహీత, ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామానికి చెందిన కొండ రవియాదవ్ హాజరుకానున్నారు. ఈ సమావేశానికి సంఘం అధ్యక్షుడు జావేద్ జమేదర్ ప్రత్యేక ఆహ్వానం పంపారు. ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్లో జరిగే ఈ కార్యక్రమంలో కొండ రవియాదవ్‌కు జాతీయ గౌరవ్ సమ్మన్ సర్టిఫికెట్ ప్రదానం చేయనున్నారు. ఈ వేడుకకు కేంద్ర న్యాయ సాధికారిక శాఖ మంత్రి రామ్స్ అత్వలే హాజరుకానున్నారని రవియాదవ్ తెలిపారు. కొండ రవియాదవ్‌కు జాతీయ స్థాయి ఆహ్వానం అందడం పట్ల మండల ప్రజలు, ధూళికట్ట గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రైతు ముంగిట్లోకి నాణ్యమైన విత్తనాలు..



**ఆమనగల్లు, జూన్ 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రైతులకు అందుబాటులో ఉండేందుకు వారి ముంగిట్లోకే నాణ్యమైన విత్తనాలను అందజేస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్, వైస్ చైర్ పర్సన్ తల్లోజు గీత ఆచారి అన్నారు. ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'రైతు వేదికలో విత్తనాల మేళా.. రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాలు' కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి పెద్ది శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం వారు ఏర్పాటు చేసిన రైతు అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ.. ఈనెల 23 నుండి 30 వరకు ప్రతీ రైతు వేదికలో రైతులకు ఖరీఫ్ సీజన్లో కావలసిన నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంటాయని అన్నారు. ఈ విత్తన మేళాలో సన్నవడ్లు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విత్తనాలు, నానో యూరియా, నానో డిఏపీలు రైతులకు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. వ్యవసాయ పంటలపై సూచనలు సలహాలు కావాలంటే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సునీత ప్రశాంత్ నాయక్, సర్పంచ్ కొప్పు యాదయ్య, మాజీ జడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, కుమార్ గౌడ్, డీలర్లు వెంకయ్య, సందీప్, చంద్ర మౌలిత్, వ్యవసాయ విస్తరణ అధికారులు నికిత, ప్రభావతి, మీనాక్షి, భూదేవి మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్‌లో ఘనంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

**ప్రత్యేక పూజలు -- సేవా కార్యక్రమాలతో జన్మదినం**





**తెలకపల్లి, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి జన్మదినం సందర్భంగా క్యాంపు కార్యాలయంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే సతీమణి డా. సరిత రాజేష్ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ప్రజల సుఖసంతోషాలు, నియోజకవర్గ అభివృద్ధి కోసం దైవాన్ని ప్రార్థించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు.

**విద్యార్థులకు బుక్స్, ప్లేట్ల పంపిణీ**

ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని తెలకపల్లి మండలం పర్వతాపూర్ గ్రామంలో విద్యార్థులకు బుక్స్, ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు సతీష్ రెడ్డి మాట్లాడుతూ, "పేద ప్రజలకు సేవ చేయాలనే తపనతో రాజకీయాల్లోకి వచ్చిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి సంక్షేమ పథకాలతో ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయన స్ఫూర్తితో విద్యార్థులకు సేవా కార్యక్రమాలు చేపట్టాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ మహేందర్ రెడ్డి, శివకుమార్, పరుశరాముడు, జంగయ్య, గద్వాల రాజు, సత్తయ్య, వెంకటయ్య, బాలకృష్ణతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన

**-చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దు**

**-- ఎక్సైజ్ సీఐ జె. వెంకట్ రెడ్డి**




**కల్వకుర్తి, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం (జూన్ 26) సందర్భంగా కల్వకుర్తి సబ్‌డివిజన్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వారం రోజులపాటు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ జె. వెంకట్ రెడ్డి తెలిపారు. జెపి నగర్ బీసీ బాలుర రెసిడెన్షియల్ కళాశాలలో 30 మంది విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, చట్టరీత్యా తీసుకునే చర్యలపై వివరించారు. "తాత్కాలిక ఆనందం కోసం డ్రగ్స్‌కు బానిసలై అమూల్యమైన భవిష్యత్తును అంధకారంలోకి నెట్టవద్దు. వ్యసనాలకు దూరంగా ఉంటే ఆనందమైన జీవితం గడుపుతూ ఆశయాలను నెరవేర్చుకోవచ్చు" అని విద్యార్థులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అంబాజీ, అధ్యాపకులు, ఎక్సైజ్ సిబ్బంది చంద్రశేఖర్, సిద్ధార్థ, విద్యార్థులు పాల్గొన్నారు.

## సెకండ్ క్లాస్ కోర్టు జడ్జి గా కల్వకుర్తి న్యాయవాది ఏ. రాంగోపాల్

**-హైకోర్టు ఉత్తర్వులతో నియామకం**



**కల్వకుర్తి, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి ప్రాంతానికి చెందిన న్యాయవాది ఏ. రాంగోపాల్ నాగర్‌కర్నూల్ జిల్లా సెకండ్ క్లాస్ కోర్టు జడ్జిగా నియమితులయ్యారు. ఈ నియామక ఉత్తర్వులను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జారీ చేసింది. గత 14 సంవత్సరాలుగా కల్వకుర్తి జూనియర్, సీనియర్ కోర్టుల్లో న్యాయవాదిగా సేవలందించిన రాంగోపాల్, ఇప్పుడు జడ్జిగా బాధ్యతలు స్వీకరించనుండటం పట్ల స్థానిక న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## ఎలిగేడులో ఎస్ఐఆర్‌పై అవగాహన సమావేశం


బి ఎల్ ఓ లకు ఎస్ ఐ ఆర్ పై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో గంగయ్య

**ఎలిగేడు, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం బీఎల్వోలకు ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య హాజరై మాట్లాడుతూ, బీఎల్వోలు ఎస్ఐఆర్‌పై పూర్తిగా అవగాహన కలిగి ఉండి నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ నిర్వహణ విధానం, దాని ప్రాముఖ్యతపై పూర్తి వివరాలు అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యాకన్న, ట్రైనర్ నాయబ్ తహసీల్దార్ అనిల్ కుమార్, నాయబ్ తహసీల్దార్ రాజేంద్రప్రసాద్, అర చంద్రశేఖర్, బీఎల్వోలు, మండల జీపీవోలు పాల్గొన్నారు.

# ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి

**- బీఆర్ఎస్వీ నాయకుడు వర్షిత్**




**ఆమనగల్లు, జూన్ 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఎన్నికల సమయంలో ఫీజుల నియంత్రణ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాట మార్చిందని బీఆర్ఎస్వీ నాయకుడు మీసాల వర్షిత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు యథేచ్ఛగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయన్నారు. విద్యను వ్యాపారంగా మార్చి అధిక ఫీజులు వసూలు చేస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకుని ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# తిరుమల సన్నిధిలో అనంతరెడ్డి



**ఆమనగల్లు, జూన్ 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని మంగళవారం ఆమనగల్లు మాజీ వైస్ ఎంపీపీ, కాంగ్రెస్ జిల్లా నాయకుడు జక్కు అనంతరెడ్డి దర్శించుకున్నారు. స్వామివారికి పూజలు నిర్వహించారు. కల్వకుర్తి నియోజకవర్గ అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు అనంతరెడ్డి తెలిపారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో జూలూరి సురేష్, శ్రావణ్ కుమార్ రెడ్డి, మాధవరెడ్డి, శ్రీపాల్ రెడ్డి తదితరులున్నారు.

# గీతా కార్మికుల ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలి

**- గౌడ సంఘం**




**ఆమనగల్లు, జూన్ 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కల్వకుర్తి నియోజకవర్గ గౌడ సంఘం నాయకులు సరూర్‌నగర్‌లోని డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ (డీపీఈఓ) ఉజ్వల రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. గీతా వృత్తిలో భాగంగా ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా నిధులను తక్షణమే మంజూరు చేసి బాధితులకు చెక్కులు అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అలాగే కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న గౌడ లైసెన్సులను కూడా త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో గౌడ సంఘం నాయకులు మట్ట వెంకటేష్ గౌడ్, దండు శ్రీనివాస్ గౌడ్, పాలకూర్ల రాజు గౌడ్, కందికంటి బాలకృష్ణ గౌడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# మొహరం ఉరుసు వేడుకల్లో బైరెడ్డి మల్లికార్జున్ రెడ్డి



**నందికొట్కూరు, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పగిడ్యాల మండల వనములపాడు గ్రామంలో కులమతాల భక్తుల ఆదరణ పొందిన తిక్కస్వామి దేవుడి ఉరుసు (మొహరం) పండుగను గ్రామ పెద్దలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బైరెడ్డి మల్లికార్జున్ రెడ్డి, పుల్యాల నాగిరెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గ్రామంలో మొహరం పండుగ సందర్భంగా వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఓంకార్ రెడ్డి, మాజీ సర్పంచ్ మద్దిలేటి, ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి, మహేష్ నాయుడు, తిక్కస్వామి, కార్యకర్తలు, గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలి





**ఆమనగల్లు, జూన్ 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** మూడు నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలందరిని అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని ఆమనగల్లు మున్సిపాలిటీ ఛైర్మెన్ పత్యనాయక్, వైస్ చైర్ పర్సన్ తల్లోజు గీత ఆచారి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో అమ్మ మాట – అంగన్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్వాడీ లోనే పిల్లలకు మంచి ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తామన్నారు. అనంతరం నూతనంగా అంగన్వాడీకి వచ్చిన పిల్లలకు ఆమె స్వాగతం పలికి, అక్షరాభ్యాసం చేయించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సునీత ప్రశాంత్, టీచర్ నాగమణి, నాయకులు కుమార్ గౌడ్ మరియు తల్లులు, పిల్లలు, కిషోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

**11వ వార్డు కాటన్ మిల్లులో**

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని కౌన్సిలర్ సునీత ప్రశాంత్ నాయక్ అన్నారు. 11వ వార్డు కాటన్ మిల్లులో అమ్మ మాట – అంగన్వాడి బాట కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సునీత ప్రశాంత్ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రానికి మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలను పంపించాలని కోరారు. అంగన్వాడీ కేంద్రంలో అందించే పోషకాహారం పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ రాజ్యలక్ష్మి, సంధ్య, ఆయా దేవమ్మ, ఆశా వర్కర్ సల్మా మరియు తల్లులు, పిల్లలు, కిషోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.




**8వ వార్డు సంకటోనిపల్లిలో**

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులెందుకు దండగ.. అంగన్వాడీ కేంద్రాలు ఉండగా' అనే నినాదంతో 'అమ్మమాట – అంగన్వాడీ' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు సంకటోనిపల్లి అంగన్వాడీ కేంద్రంలో బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ ఎనుమల్ల రమేష్ హాజరై మాట్లాడుతూ.. 3ఏళ్లు నిండిన పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు ఉచితంగా యూనిఫాంలు కూడా ఇస్తున్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ లక్ష్మమ్మ, ఆయా శ్రీదేవి మరియు తల్లులు, పిల్లలు, కిషోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యావ్యవస్థపై కాంగ్రెస్ నిర్లక్ష్యం




**ఆమనగల్లు, జూన్ 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యమైందని ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గ సభ్యులు పురుగుల శివ, రాష్ట్ర నాయకులు లండం మల్లేష్, గోరటి భరత్ విమర్శించారు. రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభమై 5 రోజులు గడుస్తున్నా.. ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం పుస్తకాలు, యూనిఫారాలు కూడా ఇవ్వని చేతగాని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని వారు మండిపడ్డారు. మంగళవారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలో రేషనలైజేషన్ పేరుతో రాష్ట్రంలోని 23వేల ప్రభుత్వ స్కూళ్ల మూసివేత నిర్ణయానికి నిరసనగా... పాఠశాలల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు శివ, మల్లేష్, భరత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని సుమారు 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 23 వేల పాఠశాలలను మూసివేసి, మూడు లేదా నాలుగు మండలాలకు ఒకే పాఠశాలను ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ ఆలోచన గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యా హక్కులను కాలరాస్తోందని వారు విమర్శించారు. ముఖ్యమంత్రి చేసిన ఈ ప్రకటనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో జరుగుతున్న విచ్చలవిడి ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని, విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు 25 శాతం సీట్ల కేటాయింపును పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న ఎంఈఓ ,డిఈఓ పోస్టులతో పాటు టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే జాతీయ విద్యా విధానం అమలు చేయాలని, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిర్వహిస్తున్న పుస్తకాలు, యూనిఫార్మ్‌ల విక్రయాలను నిషేధించాలని తెలిపారు. కార్యక్రమంలో నరేష్ గౌడ్, మల్లేష్, సురేష్, అఖిల్, సాయి తదితరులు ఉన్నారు.

# యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**- సీఐ భీమ్ కుమార్**



**ఆమనగల్లు, జూన్ 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కల్వకుర్తి సీఐ భీమ్ కుమార్ అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని వెల్ఫేర్ బాలికల పాఠశాలలో మాదక ద్రవ్యాలపై ఎస్ఐ కురుమూర్తి తో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.విద్యార్థులు, యువత బంగారు భవిష్యత్తును మాదక ద్రవ్యాలు నాశనం చేస్తున్నాయన్నారు. 25 ఏళ్లలోపు యువతే అధికంగా మత్తుకు బానిసలు అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం యువతీ యువకులు, పట్టణ ప్రజలకు మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై సీఐ అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, పోలీస్ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**- ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు**




**ఆమనగల్లు, జూన్ 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** మత్తు పదార్థాలకు బానిస అయితే జీవితాలను కోల్పోయిన సంఘటనలు చోటుచేసుకున్నాయని.. వాటికి దూరంగా ఉండాలని ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో భాగంగా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ఎస్‌హెచ్‌వో ఎస్. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు బానిస అయితే జీవితాలను కోల్పోయిన సంఘటనలు చోటుచేసుకున్నాయని.. వాటికి దూరంగా ఉండాలని అన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరం ఉండాలని సూచించారు. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు తెల్లకాగితం లాంటివారని మంచి అలవాట్లు అలవర్చుకుంటే బంగారు భవిష్యత్తు ఉంటుందని అన్నారు. గంజాయి, డ్రగ్స్ లాంటి పదార్థాలు ఎవరైనా సేవిస్తే , విక్రయించినా , రవాణా చేసినా సమాచారాన్ని 1908, 14446 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని అన్నారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు కోటేశ్వరరావు, సీతారాంరెడ్డి, ఏఎస్ఐలు రాంరెడ్డి, మురళీధర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కొల్లాభావాపురంలో ఎక్సైజ్ దాడులు

**నాటుసారా స్వాధీనం -- ఇద్దరు అరెస్ట్**



**నందికొట్కూరు,జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కర్నూలు జిల్లా అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, నంద్యాల జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి ఎస్. రవికుమార్ ఆదేశాల మేరకు నందికొట్కూరు మండలం కొల్లాభావాపురం గ్రామంలో ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో 20 లీటర్ల నాటుసారా, ఒక టీవీఎస్ ఎక్సల్ మోపెడ్ స్వాధీనం చేసి, కావేటి రామేశ్వరమ్మ, ఎరుకుల మాధవి అలియాస్ మద్దమ్మ అనే ఇద్దరిని అరెస్ట్ చేశారు. అదేవిధంగా గ్రామ సమీప అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీకి సిద్ధం చేసిన 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.ఈ దాడుల్లో నందికొట్కూరు ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు, ఎస్ఐలు భాష్యం, శ్రీనివాసులు, జఫరుల్లా, కర్నూలు ఎన్ఫోర్స్మెంట్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శంకర్ నాయక్, సిబ్బంది కృపావర కుమారి, శివన్న, సుధీర్, పరీక్షిత్, విద్యా ప్రియదర్శిని, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఇండ్లపై స్థానికుల ఫిర్యాదు



**పెద్దపల్లి, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని నిలిపివేయాలని రంగంపల్లి నివాసితులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.11వ వార్డులో పూదరి లక్ష్మి--నర్సయ్య దంపతులకు మంజూరైన ఇందిరమ్మ గృహం నిర్మాణంలో సెట్‌బ్యాక్ లేకుండా తమ స్థలాన్ని ఆక్రమిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. మున్సిపల్ అధికారులు విచారణ అనంతరం పనులు ఆపాలని ఆదేశించినప్పటికీ, రాజకీయ ఆశ్రయం ఉన్నదన్న ధీమాతో నిర్మాణం కొనసాగుతోందని తెలిపారు.ఈ విషయంపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి తమ స్థలంలో నిర్మాణం జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

# అక్రమ ఇసుక డంపులు సీజ్



**కరీంనగర్, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా, నిల్వలను అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.కొత్తపల్లి మండలంలో మంగళవారం ఉదయం నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో బావుపేట గ్రామ పరిధిలో నిల్వ ఉంచిన మూడు భారీ ఇసుక డంపులను గుర్తించి సీజ్ చేశారు. వీటిలో మొత్తం 75 ట్రాక్టర్ల లోడుల ఇసుక ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న ఇసుకను చట్టపరమైన చర్యల కోసం కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.అదేవిధంగా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఒక ట్రాక్టర్‌ను కూడా పోలీసులు పట్టుకున్నారు.సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ అక్రమ ఇసుక తవ్వకాలు, నిల్వలు, రవాణా చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. కమీషనరేట్ వ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై మైనింగ్ చట్టాలు మరియు ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# సైబర్ నేరగాళ్ల వలలో గ్రానైట్ మేనేజర్

**కరీంనగర్, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నకిలీ మొబైల్ యాప్ కారణంగా నగరంలోని వావిలాలపల్లికి చెందిన గ్రానైట్ మేనేజర్ మాపురపు తిరుపతి సైబర్ మోసానికి గురయ్యారు. ఆయన ఎస్‌బీఐ ఖాతా నుండి రెండు విడతలుగా మొత్తం ?94,999 డెబిట్ అయ్యింది.తన ఫోన్‌లో పీఎం యోజన ఏపీకే అనే నకిలీ యాప్ ఇన్‌స్టాల్ చేయబడినట్లు పోలీసులు గుర్తించారు. బాధితుడు వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930లో ఫిర్యాదు చేసి, త్రీ-టౌన్ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించారు. గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయకూడదని, నకిలీ యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవద్దని పోలీసులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు.

# పచ్చదనానికి అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ చేపట్టాలి

**-విద్యార్థుల్లో ప్రకృతి పట్ల అవగాహన పెంపొందించాలి**

**- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నందికొట్కూరు, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో చేపడుతున్న హరితాభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి, విద్యాసంస్థల ఆవరణలను పచ్చదనంతో నింపాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు.మంగళవారం జూపాడుబంగ్లా మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) మరియు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా విద్యాసంస్థల ప్రాంగణాల్లో చేపట్టిన అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని పరిశీలించి, మొక్కల పెంపకం, సంరక్షణ, నీటి వసతి, వాటి పెరుగుదల స్థితి తదితర అంశాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.అనంతరం గురుకుల విద్యాసంస్థలో ఉద్యానవన అభివృద్ధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, నాటిన మొక్కల నిర్వహణ, ప్రాంగణ సుందరీకరణ, పచ్చదనం విస్తరణకు చేపడుతున్న చర్యలను పరిశీలించి, పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు.పాఠశాలల ఆవరణల్లో విస్తృతంగా మొక్కలు నాటడం ద్వారా విద్యార్థులకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణం అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ విధానంలో తక్కువ విస్తీర్ణంలో అధిక సంఖ్యలో మొక్కలను పెంచే అవకాశం ఉండటంతో పచ్చదనం వేగంగా విస్తరిస్తుందని వివరించారు.నాటిన ప్రతి మొక్క జీవించి ఎదిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, మొక్కల సంరక్షణ బాధ్యతను పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు భాగస్వామ్యంగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు విద్యతో పాటు పర్యావరణ పరిరక్షణలోనూ భాగస్వాములు కావాలని, ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను దత్తత తీసుకుని దాని సంరక్షణకు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.పాఠశాలల్లో పర్యావరణహిత కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ప్రకృతి పరిరక్షణపై బాధ్యతాయుతమైన దృక్పథం పెంపొందుతుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం గురుకుల విద్యాసంస్థలోని డైనింగ్ హాల్‌ను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు, తాగునీటి సౌకర్యాలు, ఇతర మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ మరియు సిబ్బందికి సూచించారు.

## తంగడంచ ఫీడర్ ఛానల్ పనులను పరిశీలించిన

# జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా





**-పొలాల మధ్య 4 కి.మీ ఆటోలో ప్రయాణించి తనిఖీ**





**నందికొట్కూరు, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జలధార--జలహారతి పథకం కింద చేపడుతున్న నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, సాగునీటి వనరుల అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం జూపాడుబంగ్లా మండలంలోని తంగడంచ గ్రామంలో ఫీడర్ ఛానల్ పునరుద్ధరణ పనులు, చెరువుకు నీరు చేరే సరఫరా కాలువలు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకు అభివృద్ధి పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పొలాల మధ్య ఆటోలో ప్రయాణిస్తూ దాదాపు 4 కిలోమీటర్ల దూరం తనిఖీ చేసి, నీటి ప్రవాహం, ఫీడర్ ఛానల్ అనుసంధానం, సాగునీటి అవసరాలకు అవి అందిస్తున్న ఉపయోగంపై అధికారులతో చర్చించారు.ఉపాధి హామీ పథకం కింద రెండు ఫీడర్ ఛానల్స్ అభివృద్ధి పనులకు రూ.6.73 లక్షల అంచనా వ్యయం కేటాయించినట్లు అధికారులు వివరించారు. చెరువు పరిధిలో ఆక్రమణలు తొలగిస్తే నీటి నిల్వ సామర్థ్యం దాదాపు 20 శాతం పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. దీంతో అదనంగా 0.05 ఎంసీఎఫ్‌టీ నీరు నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.చెరువుల అసలు విస్తీర్ణాన్ని పరిరక్షించడం ద్వారా భూగర్భ జలాల పెరుగుదలతో పాటు రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని కలెక్టర్ అన్నారు. జలధార--జలహారతి కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల పరిరక్షణ, వ్యవసాయాభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, ప్రతి దశలో సాంకేతిక ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా పనులు అమలు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో ట్యాంకుల పునరుద్ధరణతో పాటు జిమ్, వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధి పనుల కోసం రూ.60 లక్షలు మంజూరైన విషయాన్ని ప్రస్తావిస్తూ, అభివృద్ధి పనులను సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం డ్వామా సిబ్బంది, మైనర్ ఇరిగేషన్ మరియు ఇతర శాఖల అధికారులతో కలిసి మొత్తం పనులను సమగ్రంగా పరిశీలించిన కలెక్టర్, పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేస్తూ మరింత వేగవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.ఈ తనిఖీలో డ్వామా పీడీ సూర్యనారాయణ, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు వేదికల్లో విత్తన మేళా



**కరీంనగర్/పెద్దపల్లి, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ మండల రైతు వేదికలో జూన్ 23 నుండి 30 వరకు ప్రత్యేక విత్తన మేళా ప్రారంభమైంది. మండల వ్యవసాయ అధికారి వేల్పుల పూజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని డివిజనల్ వ్యవసాయ అధికారి ఎల్. వీణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ ప్రారంభించారు. అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సన్న రకాల వరి విత్తనాలు కేఎన్ఎం-1638, కేఎన్ఎం-771, ఆర్ఎన్ఆర్-15048, జై శ్రీరామ్, బీపిటి-5204 రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ విత్తనాలను సాగు చేస్తే ప్రత్యేక బోనస్ లభిస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.కమలాపూర్ మండలం గూడూరు రైతు వేదికలో కూడా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నాణ్యమైన విత్తనాల సరఫరా కార్యక్రమాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తవుటం ఝాన్సీ రాణి రవీందర్ ప్రారంభించారు. అనంతరం కమలాపూర్ సబ్ ఇన్స్పెక్టర్ దిలీప్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ నిర్వహించగా, గూడూరు ఎం.జె.పి విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామ రైతు వేదికలో వానకాలం సీజన్ సందర్భంగా విత్తన మేళాను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ప్రారంభించి సబ్సిడీపై రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటుందని, సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తామని భరోసా ఇచ్చారు. క్వింటాల్ సన్న వడ్లకు ?500 బోనస్ అందిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ?1,750 కోట్ల బోనస్ నిధులు కేటాయించగా, పెద్దపల్లి నియోజకవర్గానికి ?88.40 కోట్ల బోనస్ రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు.అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని సాంబ మసూరి, తెలంగాణ సోన, హెచ్ఎంటి సోన, జై శ్రీరామ్, కూనారం సన్నలు, వరంగల్ 4444, కేఎన్ఎం7715 అనే ఏడు రకాల సన్న వడ్లను మాత్రమే సాగు చేయాలని, వీటికి ప్రభుత్వం పూర్తి బోనస్ అందిస్తుందని తెలిపారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువులను వినియోగించాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.